

# ప్రమోదకరమైన ప్రమాదం

ముక్కుపాటి నరసింహశాస్త్రి

ప్రమాదాలు ఎప్పుడూ ప్రమాదాలే. ఎప్పుడూ బాధాకరాలే. చాలావరకు విషాదాంతాలు కూడాను. కాని ఎక్కడో నూటికో, కోటికో ఈ సామాన్య సూత్రానికి వ్యతిరేకంగా జరగడం కూడా కద్దు. అటువంటి ప్రమాదం వల్ల ప్రమాదం ఏమీ లేకపోవడమే కాకుండా, బాధలూ, రోదనలూ, విషాదాలూ లేకపోవడమే కాకుండా దర్శనీయంగానూ, ఆనందజనకంగానూ హాస్యోదంతంగానూ ఉండటంకూడా నే నెరుగుదును. ప్రమాదమన్న మాటేమిటి? మృత్యుదర్శనం. లేదా తత్కథనం తరుచు హాస్యజనకంగా ఉంటూ ఉంటుందంటే మీరు నమ్ముతారా? వినండి మరి...


మదరాసులో మాకు దూరపు బంధువు కొంచెము స్థితిమంతురాలు ఒకామె వున్నది. పెద్దది. ఒంటరిది. ఆమె అలుడు పోయాడు. నేను పత్రికలలో వార్త చదివి, ఆమెకు పరామర్శ ఉత్తరం వ్రాశాను. పాపం చాలా సంతోషించింది కూడాను. తరువాత కొంత కాలానికి మద్రాసు వెళ్ళినప్పుడు ఆవిడను చూడడానికి వెళ్ళాను. వెనుకటి విషాదం కొంతసేపటికి జ్ఞాపకం తెచ్చుకుని ఇగిరిపోయిన కన్నీటిఊటను పైకి రప్పించి, రెండు మూడు ఆ చుక్కలుకూడా రాల్చింది. ఆవిడ తల్లి తండ్రి, భర్త వగైరా పోవడం సహజమనుకొన్నదటగాని ఈ అల్లుడు పోతాడని ఏనాడూ ఆవిడ అనుకోలేదట. ఆ shock నుంచి తేరుకోలేకపోతున్నదట. ఆయన జబ్బు, ఆయన పడ్డ బాధ వైద్యంచేసిన వైద్యులు పడ్డ బాధ, ఆయిన ఖర్చుకు తను పడ్డ బాధ వగైరాలన్నీ ఎంతో సూక్ష్మంగా, వివరంగా, చక్కగా నవలలో లా వర్ణించింది, నరక పోయి వచ్చాన్రా దేవుడా అని చాలాబాధపడుతూ. ఓపికగా నాకు మద్రాసులో మరేం పనిలేనట్లు వింటూ కూచున్నాను. మధ్య మధ్య కునికిపాట్లు వచ్చి ఉంటాయేమోనని నా అనుమానం. ఆవిడకూ ఆ అనుమానమే కలిగివుండవచ్చు. 'ఆయన ఎట్లా పోయినాడో తెలుసునా' అంది హఠాత్తుగా. నేను ఉలిక్కిపడి, ఖంగారు పడి, ఎవరు ఎలా పోయారా అని క్షణం ఆలోచించి అవును పాపం. పోయారు. ఏదో జబ్బుచేసి ఉంటుంది. లేకపోతే ఎలా పోతారు. ఇదేమైనా రైలు పయాణమా ఏమన్నానా అన్నాను. ఏమిటా వెకిలితనం అన్నట్టు నాకేసి తీక్షణంగాచూచింది. నా తప్పు నేను సరిదిద్దుకుని "అప్పుడేదో పక్షవాతమో ఏదో అనుకున్నాం" అన్నాను. ఆవిడ ఒక్క క్షణం తెల్లబోయి. మరుక్షణంలో మళ్ళీ నలపడి, నా అజ్ఞానానికి జాలిపడుతున్నట్టు, అదోలా మొహం పెట్టి, ఆయన కలాటి వెధవ జబ్బు వస్తుందని ఎలా అనుకున్నావయ్యా అనే అర్థం స్ఫురింపచేస్తూ "అబ్బెబ్బె అదేం కాదండి" అని మళ్ళీ ముఖ భంగిమ మార్చి, ముఖానికి వికాసం కల్పించుకుని ఎంతో తృప్తిగా ఉన్నట్టు దరహాసంచేస్తూ, "అదేం కాదండీ. ఆయన ఎటా పోయినాడో తెలుసునా...... Coronary thrombosis' అని ఎంతో హుషారుగా, ఉత్సాహంగా అన్నది. ఆ కబురు చెపుతుంటే, ఆమె ముఖంలో ఎంతో తృప్తి ఆనందం కనపడ్డాయి. ఆవిడకంత సంతోషంగా ఉంటె మధ్య నాకు విచారం ఎందుకని నేనూ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ 'అలాగటండీ

# ప్రమోదకరమైన ప్రమాదం

Thrombosis: Coronary thrombosis. దాగుందండీ చాలా సంతోషం. చావంటే అలా చావాలి. హాయిగా క్షణంలో అంతా అయిపోతుంది. ఏ వెధవ కుళ్ళు జబ్బుతోటో తీసుకుతీసుకు చావకుండా ఇట్టే పచ్చారుకున్నాడు. చాలా సంతోషం" అని హాయిగా కులాసాగా నవ్వుకుంటూ వస్తానండీ" అని వీధిలో కొచ్చాను. మృత్యువార్తే ఇంత మనకు ఆనందజనకమైతే. ఇకనో చిన్ని ప్రమాదం ప్రమోదకరం ఎందుకు కాదు. ఇది విని మీరే చెప్పండి. అదో చిన్న ప్రమాదం. స్కూటరు ప్రమాదం. కారూ. లారీ బస్సూ పేం కాదు. వెధవ స్కూటరు. చిన్న స్కూటరు. ఎంత గమ్మత్తు చేసింది! ఎంత గందరగోళం రేపింది! కథ నడిపింది!

శేఖరుది ఆ స్కూటరు. ఏమాట కామాటే అనాలి ఆ స్కూటరు తప్పేం లేదిందులో. శేఖరు తప్పుమటుకేముంది. ఎన్నిశోధాల ఆలోచించినా ఎవరినన్నడానికి తగ్గవీలేమి కనపడ లేదు. అయినా మీరేచెప్పండి చూద్దాం.

శేఖరుని మీరెరుగరు కాని చాలామంచివాడు. వాడు మావాడులెండి. చాలా హుషారైనవాడు గవర్నమెంటు సెక్రెటేరియట్‌లో మధ్యతరగతి ఉద్యోగి అయినా, చాలా తొందరలోనే, అనగా కొద్దిరోజులలోనే, కొన్ని గంటల్లోనో చాలా పెద్ద ఉద్యోగి కాకతప్పదు అలా కానినాడు ఈ గవర్నమెంటు గతేమిటా అని ఆ సమానం అలోచినుందేటంత ఆత్మవిశ్వాసం కలవాడు. ఇంటిపగరు కొంత కలవాడు. ఇక్కడె కొంత తెలున్నాడు స్నేహితులకు చాలామందికి శేఖరు లేకపోతే మన గతిమిటని అనిపిస్తూందేవాడునూ ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సృష్టిలో ఉండే



"విరగబూసిన వెలుగు పొదలు"
ఫొటో: వి. నాగేశ్వరరావు. గుంటూరు. 2

మంచివస్తువులన్ని తన ఆనందంకోసమే ఉన్న వని. తాను వాటి ననుభవించకపోతే. ఈసృష్టినీ సృష్టికర్తనూ తను కించపరుస్తున్నట్లు భావించుకునే వెర్రివాడు.

సరే శేఖరుమాటకేమికాని. అతని భార్య సంగతి చెప్పాలి. రత్నం లాటిపిల్ల. రాజేశ్వరి. రత్నంఅంటే నిసజైన జాతిరత్నం, కృత్రిమం. కాదు. అసలు కృత్రిమంఅంటే ఏమిటోకూడా తెలియదు పాపం. రాజేశ్వరికి. కృత్రిమం అనే శబ్దమేనా ఎరుగని. వినని కుటుంబంలో పుట్టింది ఆ అమ్మాయి — మా శేఖరుకోసం శేఖరం అదృష్టవంతుడని చెప్పానుగదా. అంతేకాకుండా అసాధ్యుడుకూడాను. మనలో మనమాట. దేవాంతకుడు కూడాను. శేఖరం వూరికి, రాజేశ్వరి ఊరికి చాలాదూరం. ఇతనెన్ని వూళ్ళు తిరిగినా ఆవూరు తనెప్పుడూ వెళ్ళలేదు. ఆ అమ్మాయివాళ్ళ వూరెప్పుడూ దాటి బయటికి రాలేదు. ఆఖరుకా చదువుకుకూడా. ఆ అమ్మాయి చదువంతా ఇంట్లోనూ వంటింట్లోనె జరిగింది. ఎలా జరిగిందో తెలియదుకాని శేఖరం ఆ అమ్మాయిని చూడడం, మెచ్చుకోవడం, వివాహమాడడం అయిదు రోజుల్లో ముచ్చటలూ, మూడునాళ్ళ ముచ్చటలూ, అన్నీ క్షణాలమీద జరిగిపోయాయి. సృష్టిలో నుంచి సౌందర్యంఅంతా తనకొసమే పుట్టినదనే దృఢవిశ్వాసం కలవాడు శేఖరని మొదటనే చెప్పానుకదూ! వివాహమయిన తరువాత ఆ విశ్వాసం మరీ ఎక్కువయింది శేఖరుకు శుభకార్యం, కారణమూ కావడంతో, భార్యా సమేతంగా భాగ్యనగర ప్రవేశం చేశాడు. ఇక తర్వాత వారి ప్రేమాయణగాథంతా రామాయణమంత ఉన్నది. ఒక్క విషయం మటుకు ముందుచెప్పాలి. ఎప్పుడుకొన్నాడో. రెండోకంటివానికి తెలియకుండా. చడీచప్పుడూ లెకుండా. శేఖర్ స్కూటర్ ఒకటికొన్నాడు. స్కూటర్‌కొన్న యువకులకు, అనేకులకు, అర్ధనారీశ్వరత్వం సిద్ధింపజేసుకోవాలనె కుతూహలం కలగడం అందరికీ తెలిసిన విషయమే. మా శేఖర్‌కికూడా ఒక శుభసమయాన ఈ ఉద్దేశము కల్గియుండాలి. ఎలా సాధించాడో ఏమో తెలియదు, కాని రాజేశ్వరికి, శుభ్రంగా. స్కూటరుపై తనతోటి కూర్చుని, భాగ్యనగర రాజమార్గాలోను, ఉద్యాన వనాల్లోను నిర్భయంగా వాహ్యాళికి వెళ్ళడం అలవాటుచేశాడు.

ఒకరోజున నేను సాహిత్య అకాడమీనుంచి సాయంకాలము సుమారు 6 గంటలకు "పబిక్ గార్డెన్స్" వైపు నడుస్తుండగా దూరాన్ని విపరీతమైన జన సమూహం కనపడినది. కొన్ని వేల సైకిళ్ళు, కొన్ని వందల కార్లు, మరికొన్ని వందల ఇతర వాహనాలు కదలడానికి ఖాళీ లేకుండా బారులు తీర్చి నిలచిఉన్నాయి, ఏమిటీ గొడవంతా అనుకున్నాను. దిగంబర కవుల పుస్తకావిష్కరణ సభా! లేక ఏదైనా రాజకీయ మహాసభా! లేక హిందూమహాసభా! హిందూ ముస్లిమ్ కొట్లాటా! లేక నడివీధిలో "సర్కార్" గారడీ ప్రదర్శిస్తున్నాడా! లేకపోతే — కొంపతీసి — ఏదేనా ప్రమాదమైన కారుప్రమాదమా! అనుకుంటూ హడలిపోతూ గుండెవేగంతోపాటు, గమనవేగం కూడా హెచ్చించి, రెండు నిముషాల్లో ఆజన సమూహాన్ని చేరి, మరో ఐదునిముషాల్లో జనాన్ని తప్పించుకొని లోపలికి వెళ్ళిచూచేసరికి ఒక యువదంపతులు స్కూటర్ మీదనుంచి, పడిన

సరిక్రొత్త మిషన్లపై సమర్థవంతమైన శిక్షణ
రవి టైపు ఇన్‌స్టిట్యూట్
4/7, బ్రాడీపేట, గుంటూరు - 2
డూప్లికేటింగ్ — జాబ్ వర్కు మా ప్రత్యేకత

విషయం తెలిసికొన్నాను. ఇంకొక అడుగు ముందరకు వేసేసరికి మా శేఖర్ దంపతులు గాఢాలింగనములోయుండి లేవడానికి ప్రయత్నిస్తున్న దృశ్యం కనపడినది. "అయ్యో!" అని ఒక అడుగు ముందుకువేస్తూ, నేను బోర్లగిలా పడ్డాను. ప్రేక్షకజనం, ఈలలు, చప్పట్లు, నవ్వులు, "బలే, బలే," శెహబాష్‌లాంటి హెచ్చరికలతో భూమ్యాకాశాలు దద్దరిల్లిపోయినాయి. నేను లేచేసరికి, శేఖర్ దంపతులూ లేచారు. ఒళ్ళు దులుపుకుందామని ప్రయత్నం చేస్తూండగా, వాళ్ళకి సహాయం చేయటానికి ఎంతోమంది ముందుకు వచ్చారు. వాళ్ళస్కూటరని ఇద్దరు ముగ్గురు ఎంతోజాగ్రత్తగా పట్టుకున్నారు.

ఇదీ కనపడ్డ దృశ్యం. అసలు జరిగిన సంగతేమిటని వాకబుచేయగా తేలినవిషయం మనవి చేస్తున్నాను. ఆనాడు అలవాటుప్రకారం శేఖర్, సాయంకాలం ఇంటికివచ్చి, స్నానంచేసి, రాజేశ్వరిచ్చిన ఉపాహార కాఫ్యాదులు సేవించి, పరస్పరాలింగన, చుంబనాదులను క్లుప్తంగా ముగించి, స్కూటర్‌మీద, "రామచంద్రపురం" వెళ్ళవలెనని బయలుదేరారట. హైదరాబాదు వచ్చినప్పటినుంచీ, ఈ యువతీ, యువకుల దాంపత్యజీవితం చుట్టుప్రక్కల కాలనీలలో ఉన్న ఆంధ్రులందరికీ ఎంతో ఆనందజనకంగా ఉత్సాహపూరితంగా, ఆదర్శప్రాయంగా ఉంటూ ఉండడం అందరికీ తెలిసిన విషయమే. వీళ్ళు ఇల్లువిడిచి, బయటకు వచ్చినా, బజారుకువెళ్ళినా, సినిమాకువెళ్ళినా, కొన్ని వేలకళ్ళు, సినిమా నాయికా, నాయకులను చూసినంత ఆదరంతో, అభిమానంతో, ఆనందంతో చూస్తూండటం వీళ్ళకు అలవాటైంది. కాని ఇన్ని వేలకళ్ళు వాళ్ళమీదఉన్నాయని వాళ్ళకి తెలిసినా, ఏమీ తెలియనట్టుగానే, ఎక్కడో ఏకాంతంలో వున్నట్టుగానే, ఈ దంపతులు తమ్ము తాము మరచి ప్రవర్తిస్తుండేవారు.

ఆనాడు అలాగే వీధిలోకి వచ్చి స్కూటరు మీద సుఖాసీనులై తమ కద్దుపద్దున్న ఆలోచనా సహస్రాలను తప్పించుకొని వెడ్తున్నారు. వాతావరణం చల్లగా సంతోషదాయకంగా ఉన్నది; దారివెంట వెనుకనుంచి, ముందు నుంచీ హెచ్చరిస్తోన్న కారుకూతలు చెవిని పడనట్టుగానే కులాసాగా కూనిరాగాలు తీస్తూ స్కూటర్ వేగం హెచ్చిస్తూ వెడుతున్నారు. సూర్యాస్తమయం అయింది. మలయమారుతం వీస్తోంది. అక్కడక్కడ కనపడ్డ పూల దుకాణాలలోంచి, రోడ్డు ప్రక్కనున్న వసతి గృహాల్లోంచి వస్తున్న ఆమహాకవి ఎవరో వ్రాసినట్టు కుడిఎడమలకుసుమపరాగం ఉన్నదో లేదోకానిసుమ సౌరభం మాత్రం కొంచెం మత్తెక్కిస్తోంది. వెనుక నున్న రాజేశ్వరికి, ముందు కూర్చున్న శేఖర్ తీస్తోన్న కూనిరాగంతప్ప, మరే ధ్వనీవినబడ్డంమానేసింది. తనవివాహం, శేఖర్‌తో జీవితం, వర్ణనాతీతమైన ప్రణయానుభూతులు వాళ్ళ సరససల్లాపాలూ, శేఖరు కొంటె మాటలూ, చిలిపిచేష్టలూ ఏమేమో స్మృతిపథంలోకి వచ్చి బాహ్యప్రపంచంలోనుంచి తనకు తెలియకుండానే భావనా ప్రపంచంలోనికి జారిపోయింది రాజేశ్వరి. ఆ సంగతి తనకేమీ తెలియదు తనెక్కడున్నదో తనకు తెలియదు. స్కూటర్ వేగం హెచ్చినది. చల్లగాలి వీస్తోంది. రోడ్డు మీద అటు, ఇటు, పిన్నలూ పెద్దలూ, స్కూటర్‌ను చూసి హడలి ప్రక్కకు పారిపోతున్నారు. రాజేశ్వరి పమిటచెంగు, పట్టుతప్పి విజయధ్వజంలా గాలిలో రెపరెపలాడుతోంది. వాలుజడ కోసంవచ్చిన నల్లతాచులా పైకి లేస్తోంది. రాజేశ్వరి వళ్ళు ఆనందంతో పరవశించిపోతోంది. ఇంత ఆనందానికి కారకుడైన శేఖర్ ఎదురుగానే ఉన్నాడనే స్ఫురణకల్గినది. వెంటనే పారవశ్యం పట్టలేక "అబ్బా" అని భర్త నడుమును, గట్టిగా కౌగిలించుకొన్నది. శేఖర్ అటువంటి తన్మయత్వంలో లేకపోయినా, స్కూటర్ మీదవున్న సంగతి స్ఫురణలో నున్నా ఆ క్షణంలో అప్రయత్నంగా కల్గిన ఆలింగనానందానుభూతికి వశుడై అతడుకూడా వర్తమానం మరచి, స్కూటర్ పట్టువిడిచి వెనుదిరిగి రాజేశ్వరిని గాఢంగా గుండెకు హత్తుకున్నాడు. ఈ క్రియ, చెప్పడానికింతసేపు పట్టిందిగాని, జరగడానికి లిప్తమాత్రమే సరిపోయింది. ఫలితం తక్షణమే కనపడినది, స్కూటర్‌తో సహా దంపతులిద్దరూ నేలమీదకు చంద్రమండలం మీద రోదసి నౌకలాగ soft గా land అయ్యారు. బనా వాళ్ళు క్రిందపడినట్టే అనుకోలేదు. ఆలింగనము విడువలేదు. అదేదో జావళిలో చెప్పినట్టు "పట్టు విడువుము సామీ, పరవశమాయెను" అని రాజేశ్వరి పాడనూలేదు అభినయించనూ లేదు. ఇంటి దగ్గర పడకగదిలో మంచంమీద ఉన్నట్టుగానే ఒకర్నొకరు చూచి, నవ్వుకుంటూ కూర్చున్నారు. చుట్టుపట్ల సైకిళ్ళ గంటలూ, కారు హారనులూ పోలీసు ఈలలూ, జనసమూహం గొడవా ఇదేమీ, రెండు నిముషాల వరకూ వాళ్ళకు యోగ వియోగము కలించలేదు. అప్పటికి పోలీసు వారు వచ్చి వేసిన కేకలతో నెమ్మదిగా లేచారు. ఒళ్ళుదులుపు కున్నారు. దెబ్బ లేమీ తగులలేదని తెలిసుకొన్నారు. కొన్ని వందల కెమేరాలు క్లిక్" చేస్తూండగా జనసమూహం ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ, జయ జయ ధ్వానాలు చేస్తూండగా పోలీసువారు జనాన్ని తప్పించి వీరికి దారి చూపగా శేఖర్ ఎడం చేతితో రాజేశ్వరిని భద్రంగా పట్టుకొని కుడి చేతితో స్కూటర్ పట్టుకుని సుమారు ఫర్లాంగు దూరం నడిచి జనంలోంచి బయట పడి స్కూటరెక్కుదామని సిద్ధమౌతూండగా టెలిఫోన్ చేసి పిలిపించినట్లు, ఒక సినిమాశేట్ వచ్చి వీరిప్రక్క నిలబడింది. యథావిధిగా, చిరకాల మిత్రుడి నాహ్వానించినట్లు దిగియుండి పార్ అని లోపలకు తీసికొని వెళ్ళి కార్లో పెట్టి స్కూటర్‌ను లోపల పెట్టించి కారు స్టార్ట్ చేయించాడు.

తరువాత తెలిసిన వార్త ఏమిటంటే సినిమా కంపెనీ వారికి వారప్పుడు తీస్తున్న పిక్చర్లో ఇటువంటి ఘట్టమొకటి వున్నదని, అందులోకి ఇప్పుడు జరిగిన సంఘటన ఎంతో చక్కగ అమరుతుందనీ వారప్పుడే కొన్ని "snaps" తీసుకొన్నారని, తరువాత ఈ జరిగినదంతా శేఖర్, రాజేశ్వరీలచేత తిరిగి నటింపచేస్తారనీ విన్నాను. ఇది, ఈ ప్రమాదం ప్రమాదకరమా? ప్రమోదకరమా? మీరేనిర్ణయించుకోవాలి.

[సాహితీ సమితి జూబిలీ సెలిబ్రేషన్స్ (డిసెంబరు 1968) వేటపాలెంలో జరిగిన సమావేశంలో చదివినది.] ★

